సాక్షి
ఖమ్మం
శనివారం । 2 । నవంబర్ । 2024



పరమ పవిత్రం.. కార్తీకం

కార్తీక మాసం శనివారం మొదలవుతుండగా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. భక్తులు ప్రత్యేక పూజలకు సిద్ధమవుతున్నారు. 8లో

ఖమ్మం నగరంలో టపాసుల మెరుపులు..



వెలుగు.. జిలుగులు!

జిల్లావాసులు దీపావళి పర్వదినాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉదయం నుంచే భక్తులు బారులుదీరారు. ఇక బాణసంచా షాపులు కిక్కిరిసిపోగా సాయంత్రం కాగానే ఇళ్లలో దీపాలు వెలిగించాక చిన్నాపెద్ద తేడా లేకుండా బాణసంచా కాలుస్తూ సందడిగా గడిపారు. అలాగే, వ్యాపారులు తమ సంస్థల్లో లక్ష్మీపూజ నిర్వహించారు. మరికొందరు మహిళలు తమ ఇళ్లలో బొమ్మల కొలువు ఏర్పాటుచేసి ఇరుగుపొరుగును ఆహ్వానించి మురిసిపోయారు. 9లో



ఖమ్మం వైరా రోడ్డులో చిన్నారితో చిచ్చుబుడ్డి వెలిగిస్తున్న తల్లి

ఆధార్ చూపరట..



సీసీఐ కేంద్రంలో కొనుగోలు చేసిన పత్తి

సీసీఐ కేంద్రాల నిర్వాహకుల తీరుపై అనుమానాలు

- గుర్రాలపాడు సెంటర్‌లో రైతుల పూర్తి వివరాలు కరువు
- తూతూ మంత్రంగానే నమోదు..
- అన్నీ ఖమ్మం మార్కెట్‌లోనే ఉంటాయని దాటవేత

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రాలు ఇప్పుడిప్పుడే పత్తి కొనుగోళ్లు మొదలవుతుండగా.. రైతుల నుంచి నామమాత్రంగానే సేకరిస్తూ వ్యాపారులకే ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పత్తి అమ్మకానికి తీసుకొచ్చిన రైతు ఆధార్‌కార్డు నమోదు చేయాల్సి ఉండగా అవేమీ బహిర్గతం చేయడం లేదు. ఖమ్మం మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడు జీఆర్ఆర్ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించిన ఎవరి ఆధార్‌కార్డు వివరాలు లేకపోవడం గమనార్హం. సెంటర్‌లో రైతులు రోజుల తరబడి వేచి ఉంటుండగా.. వారి నుంచి కాకుండా ప్రైవేట్ వ్యాపారుల నుంచే పత్తి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి


వ్యవసాయ శాఖ అధికారులు ఏటా పంట నమోదు చేపడుతున్నారు. రైతులు సాగు చేసే అన్ని పంటల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుకొచ్చిన రైతుల ఆధార్ నంబర్ నమోదు చేయగానే సాగు విస్తీర్ణం, ఇతర వివరాలన్నీ తెలిసిపోతాయి. తద్వారా నిజమైన రైతుల నుంచే పంట కొనుగోలు చేసేందుకు ఆస్కారముంటుంది. అలాగే బ్యాంకు ఖాతాకు సైతం ఆధార్ అనుసంధానం చేయించుకుంటే ఖాతాలో త్వరగా నగదు జమ అవుతుంది. ఇవేమీ లేకపోతేనే ఇతర గుర్తింపు కార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని నిబంధనల్లో పేర్కొన్నారు.

ఎందుకీ గోప్యత..

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి సేకరణకు కీలకమైన ఆధార్ నంబర్‌ను రిపోర్టుల్లో పొందుపర్చడం లేదు. కేవలం అమ్మిన వ్యక్తి పేరు, తక్‌పట్టీ నంబర్, ఎన్ని క్వింటాళ్లు, ఎంత నగదు వస్తుందనే వివరాలతో సరిపెడుతున్నారు. ఇవన్నీ ఉన్నతాధికారులకు రోజువారీగా నివేదిక పంపించేందుకు అవసరమని సరిపెట్టుకున్నా.. పత్తి అమ్మిన రైతు ఆధార్‌కార్డు వివరాలను ఎందుకు బహిర్గతం చేయడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. నివేదికలో నమోదు చేయకపోయినా, రిజిస్టర్‌లో ఎందుకు రాయడం లేదనే రైతుల ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం ఉండడం లేదు. ఎక్కువగా రైతుల ముసుగులో వ్యాపారులు తీసుకొస్తున్న పత్తిని కొనుగోలు చేస్తున్నందునే ఇలా చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

ఆ వివరాలే లేవట...

ఖమ్మం మార్కెట్ పరిధిలోని గుర్రాలపాడు జీఆర్ఆర్ కాటన్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం నిర్వాహకుల తీరు అనుమానాలకు బలం చేకూరుస్తోంది. గతనెల 21న ఈ కేంద్రం వద్ద పత్తి కొనుగోలు చేసిన పది మంది వివరాలను ఖమ్మం మార్కెట్‌కు పంపారు. అయితే, జాబితాలో ఎవరి ఆధార్ నంబర్‌కు కూడా లేదు. ఇదేమిటని అధికారులను అడిగితే ఆధార్‌కార్డు వివరాలు తమ వద్ద లేవని, నమోదు చేయగానే ఖమ్మం మార్కెట్‌కు పంపామని చెప్పడం గమనార్హం. ఇక ఖమ్మం మార్కెట్‌లో సంప్రదిస్తే అక్కడ కూడా ఆధార్ వివరాలు లేకపోగా.. భవిష్యత్‌లో కొనుగోళ్ల వివరాలను పరిశీలించాల్సి వస్తే ఎక్కడి నుంచి తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మారింది.


Ginning Mill Wise Report 21 Oct 2024

గతనెల 21న గుర్రాలపాడు కేంద్రంలో కొనుగోళ్ల వివరాలతో రూపొందించిన జాబితా

కుమ్మక్కయ్యారా?

నిబంధనల్లోని లొసుగులను ఆధారంగా చేసుకుని సీసీఐ కేంద్రాల్లో వ్యాపారుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. గత మంగళవారం పలువురు రైతులు పత్తి తీసుకొస్తే తేమశాతం ఎక్కువగా ఉందని నిరాకరించారు. ఇదే సమయాన వ్యాపారుల నుంచి మాత్రం సేకరించారని అక్కడ వేచి ఉన్న రైతులు చెప్పారు. ఆధార్ కార్డు లేని పక్షంలో బయోమెట్రిక్ అది కూడా పనిచేయకపోతే ఇతర గుర్తింపు కార్డుల ఆధారంగా పత్తి కొనుగోళ్లు చేయొచ్చని సీసీఐ నిబంధనల్లో ఉంది. దీని ఆధారంగా అటు వ్యాపారులు, ఇటు కేంద్రం అధికారులు అవగాహనతో ఇతర గుర్తింపు కార్డులను వినియోగిస్తున్నారని తెలుస్తోంది.

న్యూస్‌రీల్

ట్రంక్ పనులు వేగవంతం చేయండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న తుమ్మల

సత్తుపల్లి: ఇందిరాసాగర్‌కు సంబంధించి సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనుల్లో వేగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రిని కలిసి చర్చించారు. వచ్చే పంటకాలం సీజన్‌కల్లా కెనాల్ నుంచి నీరు సరఫరా చేసేలా భూసేకరణ, ఇతర పనులు త్వరగా చేపట్టాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తుమ్మల ఈ సందర్భంగా కోరారు.

'నవోదయ'లో ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

కూసుమంచి: మండలంలోని పాలేరు జవహర్ నవోదయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరానికి గాను 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహించనున్నారు. ఈమేరకు దరఖాస్తు గడువును ఈనెల 9వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి కేయూ అథ్లెటిక్స్ మీట్

హాజరుకానున్న 200మంది అథ్లెట్లు



వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్

ఖమ్మం స్పోర్ట్స్: కాకతీయ యూనివర్సిటీ పరిధి అథ్లెటిక్స్ పోటీలు శనివారం నుంచి ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరగనున్నాయి. రెండు రోజుల పాటు జరిగే పోటీలను కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ మేరకు వివరాలను యూనివర్సిటీ పీజీ కళాశాల, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రవికుమార్ శుక్రవారం వెల్లడించారు. పోటీలకు ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి 85మంది పురుషులు, 110 మంది మహిళలతో పాటు 30మంది ఫిజికల్ డైరెక్టర్లు హాజరవుతారని తెలిపారు. ఇప్పటికే పోటీల నిర్వహణ కోసం స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. 100, 200, 400, 800, 1500, 5వేలు, 10వేల మీటర్ల పరుగుతో పాటు హైజంప్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, హ్యామర్ త్రో అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ యూసీపీ ప్రిన్సిపాల్ ఏటీబీటీ.ప్రసాద్, అధ్యాపకులు పి.శ్రీనివాస్, పి.కోటి తదితరులు పాల్గొన్నారు.

రెండు పీహెచ్‌సీల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు



రికార్డులను పరిశీలిస్తున్న రాజశేఖర్‌గౌడ్

నేలకొండపల్లి: జిల్లాలోని ముదిగొండ, ఎర్రుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. నేలకొండపల్లి సీహెచ్‌సీ శుక్రవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించాక మెరుగైన వైద్య సేవలు అందించేలా సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తీసుకురాగా, చికిత్స పొందుతున్న వారికి అందించే భోజనంలో నాణ్యత పాటించాలని ఆయన ఆదేశించారు. కాగా, పీహెచ్‌సీల అప్‌గ్రేడ్ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సమర్పించామని తెలిపారు. ఇటీవల వరదలతో దెబ్బతిన్న నాలుగు సీహెచ్‌సీలకు రూ.లక్ష చొప్పున, మూడు ఏరియా ఆస్పత్రులకు రూ.2లక్షల చొప్పున కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయించారని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై నాయకులు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. వైద్యాధికారులు కె.రాజేష్, ఆర్.శ్రావణ్‌కుమార్, ఆరోగ్యమిత్ర కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆత్మీయ సమ్మేళనంలో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ సునీల్‌దత్ వెల్లడించారు. ఖమ్మంలోని పోలీసు కల్యాణమండపంలో శుక్రవారం నిర్వహించిన హోంగార్డు ఆఫీసర్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కీలకమైన బాధ్యతలు నిర్వర్తిస్తున్న హోంగార్డుల అన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కోసం యాజమాన్యాలతో చర్చిస్తానని వెల్లడించారు. కాగా, విధినిర్వహణలో పోలీసులకు సహాయకారిగా ఉండే హోంగార్డులు వ్యక్తిగత క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. సమస్యలు ఉంటే సరైన మార్గంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకరావాలే తప్ప నిబంధనలు అతిక్రమించొద్దని సీపీ హితవు పలికారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఎస్బీ ఏసీపీ సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ సునీల్‌దత్, పక్కన అదనపు డీసీపీ ప్రసాద్‌రావు

పటేల్ భావజాలం భావితరాలకు స్ఫూర్తిదాయకం

ఖమ్మంక్రైం: సర్దార్ వల్లబాయ్ పటేల్ భావజాలం భావితరాలకు స్ఫూర్తిదాయకమని అదనపు డీసీపీ ప్రసాద్‌రావు అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గురువారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో జాతిసమగ్రత కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్

- ఇటీవలే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన బృందం
- ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మహిళా డిగ్రీ కళాశాల

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఏకైక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ లభించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ అవసరమైన వసతులు కల్పించడంతో న్యాక్ బృందం గ్రేడ్‌ను ప్రకటించింది. ఇటీవల పరిశీలించిన బృందం సభ్యులు కళాశాలలో వసతులు, బోధన, గత కొన్నేళ్లుగా ఫలితాలను పరిశీలించగా తాజాగా గ్రేడ్ వెల్లడించారు. వివిధ రకాల నిధులు సుమారు రూ.1.62కోట్లతో కళాశాలలో లైబ్రరీ, ల్యాబ్‌లు ఏర్పాటుచేశారు. 1965వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ కళాశాలలో ఒకప్పుడు సీట్ల కోసం విపరీతమైన పోటీ ఉండేది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు.

2018లో కూడా..

ఐదేళ్లకు ఒకసారి న్యాక్ బృందం పరిశీలించి గ్రేడ్ ఇస్తుంది. ఇందులో భాగంగా 2018లో కూడా న్యాక్ 'ఏ' గ్రేడ్ లభించింది. ఈ కళాశాలలో అప్పుడు 42మంది అధ్యాపకులు ఉన్నారు. ప్రస్తుతం 19మంది అధ్యాపకులే ఉన్నా మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండగా మరోమారు 'ఏ' గ్రేడ్ సాధించగలిగింది. కాగా, గతంతో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం డిగ్రీ, పీజీ కలిపి 850మంది చదువుతుండగా, ఇందులో 742మంది డిగ్రీ విద్యార్థినులు, 108మంది పీజీ విద్యార్థినులు ఉన్నారు.

3.04 పాయింట్లు

విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడమే కాక కళాశాలలో అవసరమైన వసతులు కల్పించడంతో ఏటా విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. ఈక్రమంలో బోధనతో పాటు ఉపాధి కోర్సుల్లో సైతం శిక్షణ ఇస్తుండడాన్ని న్యాక్ బృందం పరిగణనలోకి తీసుకుంది. దీంతో 3.04పాయింట్లు సాధించగా న్యాక్ 'ఏ' గ్రేడ్ సొంతమైంది.



ఖమ్మంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

ఆనందంగా ఉంది..



ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మహిళా కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్ రావడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూనే ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. గతంతో పోలిస్తే రెగ్యులర్ అధ్యాపకుల సంఖ్య తక్కువగా ఉన్నా ప్రైవేట్ కళాశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా బోధిస్తున్నాం. న్యాక్ బృందం మా కళాశాల 'ఏ' గ్రేడ్ సాధించినట్లు సమాచారం ఇవ్వగా, వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రాలు అందే అవకాశం ఉంది.

– జి.పద్మావతి, ప్రిన్సిపాల్

ప్రతీ విద్యార్థికి ఆంగ్ల పరిజ్ఞానం తప్పనిసరి

- మత్తు పదార్థాలకు అలవాటైన పిల్లలకు కౌన్సెలింగ్
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థిలో ఆంగ్ల పరిజ్ఞానం పెంపొందించేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మం మామిళ్లగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ఆంగ్లం బోధనను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ఇంగ్లిష్‌పై భయాన్ని వీడి పరస్పరం రోజూ కాసేపు ఆంగ్లంలో మాట్లాడుకోవాలని సూచించారు. ఈక్రమంలో కలెక్టర్ విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడించి ఉత్సాహాన్ని నింపారు. ఆతర్వాత ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన విద్యార్థుల హాజరు, టాయిలెట్ల నిర్వహణపై సూచనలు చేశారు. కాగా, పాఠశాలల్లో కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు తేలగా వారి తల్లిదండ్రులకు తెలిపి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ తెలిపారు. అలాగే, పాఠశాలలో డైనింగ్‌హాల్, క్రీడా మైదానం కోసం పాత డీఆర్డీఓ కార్యాలయంలో భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఏఎంఓ రవి, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పిదాలకు తావులేకుండా ఇంటింటి సర్వే

జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి మొదలుకానున్న ఇంటింటి సర్వేలో తప్పులు దొర్లకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సర్వేకు సంబంధించి నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్ల గుర్తింపు త్వరగా చేపట్టి సామగ్రి అందించి శిక్షణ ఏర్పాటుచేయాలని తెలిపారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, సీపీఓ ఎ.శ్రీనివాస్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఆర్డీవోలు నర్సింహారావు, రాజేందర్, డీఈఓ సోమశేఖరశర్మ పాల్గొన్నారు.





విద్యార్థులతో కలిసి ఇంగ్లిష్ పాఠం వింటున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ (ఇన్‌సెట్) సైనిక సంక్షేమ భవనం పనులపై సూచనలు చేస్తున్న కలెక్టర్

వేగంగా సైనిక సంక్షేమ భవన నిర్మాణం

ఖమ్మంమయూరిసెంటర్: సైనిక సంక్షేమ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కార్యాలయం భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన మిగులు పనులు, లిఫ్ట్ సామర్థ్యం తదితర వివరాలు ఆరా తీశారు. మొదటి, రెండు అంతస్తులో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

9 కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు

- వివరాల కోసం వాట్సాప్ నంబర్
- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్ల కోసం జిల్లాలో తొమ్మిది కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఎ.అలీం తెలిపారు. ఖమ్మం, మధిర, నేలకొండపల్లి, వైరా, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ల పరిధి జిన్నింగ్ మిల్లుల్లో వీటిని ఏర్పాటుచేశామని, ఇప్పటి వరకు 85 మంది రైతుల నుంచి 173.94 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించిందని, 8 నుంచి 12 శాతం మధ్య తేమ కలిగిన పత్తి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, పత్తి కొనుగోళ్లు, ఇతర వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా 88972 81111 వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. కాగా, సీసీఐ కేంద్రానికి పత్తి తీసుకొచ్చే రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్‌లతో పాటు ఆధార్ నంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ సమర్పించాలని సూచించారు.

కేంద్రాలు ఎక్కడెక్కడ అంటే...

ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్, పొన్నెకల్లులోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్, మధిర మండలం మాటూరులోని మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెడ్, ఇల్లెందులపాడులోని శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్, ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్స్, తల్లాడలోని స్టాప్లరిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, తిరుమలాయపాలెం మండలంలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపడుతోందని డీఎంఓ అలీం తెలిపారు.

విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: పిల్లల నడవడిక, సంరక్షణపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. ఈ మేరకు విద్యాసంస్థల్లో వివిధ శాఖల ఆధ్వర్యాన యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్ల ల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై ప్రతీ మూడు నెలలకోసారి సమీక్షిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలైతే ఎదురయ్యే నష్టాలపై విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకోసం విద్యాశాఖ, సంక్షేమ శాఖ, వైద్య, ఆరోగ్యం, పోలీస్ శాఖల ఆధ్వర్యాన యాంటి డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, వివిధ శాఖల అధికారులు జి.జ్యోతి, కేవీబీ.రెడ్డి, స్కోప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20 వేల మంది ఉద్యోగులతో వన సమారాధన

టీజీఈ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలూరి

ఖమ్మం సహకారనగర్: జిల్లా సకల ప్రభుత్వ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశామని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు వెల్లడించారు. ఖమ్మం గొల్లగూడెంలోని చెరుకూరి మామిడితోటలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మామిడి తోటలో జరిగే సమ్మేళనానికి 20వేల మంది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు వారి కుటుంబసభ్యులతో హాజరుకానున్నారని తెలిపారు. కాగా, 206 సంఘాలతో ఏర్పడిన జేఏసీకి పూర్వవైభవం తీసుకొచ్చేలా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని చెప్పారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్, అధికారులను ఆహ్వానించామని తెలిపారు. కాగా, కొత్త ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం పెరిగిందని చెప్పారు. పెండింగ్ ఉన్న ఐదు డీఏల్లో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఒక డీఏ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవోస్, టీజీవోస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదన శ్రీనివాస్, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, దేవరకొండ సైదులు, పి.నాగిరెడ్డి తదితరులు మాట్లాడగా డాక్టర్ రమేష్ బాబు, బాబు రత్నాకర్, పద్మ, అంజమ్మ, లలితకుమారి, ఉషా, గుంటుపల్లి శ్రీను, పాటి అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, పక్కన ఉద్యోగ సంఘాల నాయకులు

క్లుప్తంగా

క్రీడాకారిణిని అభినందించిన సీపీ


ఆఫ్రిన్‌ను సత్కరిస్తున్న పోలీసు కమిషనర్

ఖమ్మంక్రైం: గుంటూరులో ఇటీవల జరిగిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మిడ్‌లే రిలే విభాగంలో పతకం సాధించిన హోంగార్డు రహీమ్ కుమార్తె షేక్ ఆఫ్రిన్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం అభినందించారు. ఖమ్మంలో గౌస్ వద్ద ఆమె శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా ఆఫ్రిన్‌ను సీపీ సన్మానించగా ఆర్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 క్రీడా జట్ల ఎంపికకు పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల ఖో-ఖో జట్ల ఎంపికకు ఈనెల 3న పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ మూసాకలీం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు 5వ తేదీన జరుగుతాయని వెల్లడించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీలకు క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 98483 41238 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

6న 'కాంగ్రెస్' సదస్సు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న కులగణనపై అవగాహన కల్పించేందుకు ఈనెల 6న కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సదస్సుకు కాంగ్రెస్‌తో పాటు అన్ని పార్టీల నాయకులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల బాధ్యులు హాజరై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

చెరుకు టన్ను ధర రూ.3,400

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో మధుకాన్ షుగర్, పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఈ ఏడాదికి చెరుకు టన్నుకు మద్దతు ధర రూ.3,400గా నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ మేనేజర్ రామారావు మాట్లాడుతూ డిసెంబర్ 7న చెరుకు క్రషింగ్ ప్రారంభించనుండగా, గత ఏడాదితో పోలిస్తే టన్నుకు రూ.210 ధర పెంచినట్లు తెలిపారు. కొత్తగా చెరుకు నాటే రైతులకు ఎకరానికి 3 టన్నుల చెరుకు విత్తనం లేదా అంతే విలువైన నర్సరీ మొక్కలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఎర్రుపాలెం కేజీబీవీలో అకౌంటెంట్, రఘునాథపాలెం కేజీబీవీలో ఏఎన్ఎం పోస్టును కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. బీకాం విద్యార్హత ఉన్న మహిళలు అకౌంటెంట్ పోస్టుకు, ఇంటర్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలో ఏఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన మహిళా అభ్యర్థులు ఏఎన్ఎం పోస్టుకు అర్హులని వెల్లడించారు. ఈనెల 4నుంచి 8వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

కార్యదర్శులకు నోటీసులు

రఘునాథపాలెం: ఇటీవల గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలు చేపట్టగా రఘునాథపాలెం మండలంలో బాధ్యతలు స్వీకరించని వారికి నోటీసులు జారీ చేసినట్లు మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కేవీ.బంజర, బూడిదంపాడు, చింతగుర్తి కార్యదర్శులు మెడికల్ లీవ్‌లో ఉండగా, చిమ్మపూడికి కేటాయించిన కార్యదర్శి విధుల్లో చేరలేదని పేర్కొన్నారు. వీరికి వారం గడువు ఇస్తూ డీపీఓ నోటీసులు జారీ చేశారని తెలిపారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారు నిర్ణీత వ్యవధిలో మెడికల్ బోర్డు నుంచి ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆదేశించారు.

పాఠశాలలో బియ్యం చోరీ

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం పథకానికి ఉపయోగించే బియ్యాన్ని దుండగులు చోరీ చేశారు. దీపావళి సందర్భంగా గురువారం పాఠశాలకు సెలవు ఇవ్వగా, నిల్వ ఉన్న 16 క్వింటాళ్ల బియ్యంలో 10 క్వింటాళ్లను అపహరించారు. ఈ ఘటనపై హెచ్ఎం యాకోబు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడి

వేంసూరు: మండలంలోని అడసర్లపాడు సమీపాన కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు. వీరి నుంచి రూ.3 వేల నగదు, ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

యువకుడిపై మృతిపై అనుమానాలు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం సోములగూడెంకు చెందిన కామిశెట్టి జగదీష్(30) ఖమ్మంలో మృతి చెందగా, ఘటనపై కుటుంబీకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు సాంబశివరావు కథనం ప్రకారం.. జగదీష్ రెండేళ్లుగా ఖమ్మం పెద్దతండాలోని వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం పనికి వెళ్లి అక్కడే మృతి చెందినట్లు తమకు సమాచారం ఇచ్చారని తెలిపాడు.



కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్య క్షేత్రాలకు వెళ్లనున్న భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిపోల నుంచి సర్వీసులను నడిపేందుకు రీజియన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఖమ్మం ఆర్ఎం ఏ.సరిరామ్ సంస్థ డిపో మేనేజర్లు, ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేశారు. రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు నుండి ఏపీలోని పంచారామాలకే కాక అరుణాచలం, అన్నవరం, శబరిమల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. అయితే, 30 నుండి 40 మంది భక్తులు ఉంటే ఆర్టీసీ నిర్ణయించిన తేదీల్లో కాకుండా భక్తులు కోరిన రోజున బస్సు బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. – ఖమ్మంమయూరిసెంటర్

పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారా..? ఆర్టీసీ బస్సులు రెడీ..!

- పంచారామాలు, అన్నవరం, శబరిమల, అరుణాచలానికి సర్వీసులు
- ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి సిద్ధం
- ముందస్తు రిజర్వేషన్‌కు సైతం అవకాశం

పంచారామాలు, అన్నవరం



పంచారామ క్షేత్రాలైన అమరావతి (అమరలింగేశ్వర స్వామి), భీమవరం (సోమేశ్వర స్వామి), పాలకొల్లు (క్షీరలింగేశ్వరస్వామి), సామర్లకోట (భీమలింగేశ్వరస్వామి), ద్రాక్షారామం(భీమేశ్వరస్వామి) క్షేత్రాలకు ఈ నెల 3, 10, 17, 24 తేదీల్లో (ప్రతీ ఆదివారం) రీజియన్‌లోని ఏడు డిపోల నుండి ప్రత్యేక (సూపర్ లగ్జరీ) బస్సులు నడపనున్నారు. ఒకే రోజులో పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశాన్ని కల్పిస్తారు. అలాగే అన్నవరానికి సైతం అదే తేదీల్లో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. పంచారామాలు, అన్నవరం దర్శనానికి వెళ్లే భక్తులు సీట్లను www.tgsrtcbus.in వెబ్‌సైట్ ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చు.

రీజియన్‌లో డిపోల వారీగా మేనేజర్ల సెల్ నంబర్లు

డిపో	సెల్‌నంబర్
ఖమ్మం	99592 25958
కొత్తగూడెం	99592 25959
భద్రాచలం	99592 25960
మధిర	99592 25961
సత్తుపల్లి	99592 25962
మణుగూరు	99592 25963

రద్దీకి అనుగుణంగా బస్సులు



కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడిపించనున్నాం. నిర్ణయించిన తేదీల్లో భక్తుల రద్దీకి బస్సులు ఏర్పాటు చేస్తాం. ఆర్టీసీలో కొత్త బస్సులే కాక నిపుణులైన డ్రైవర్లు ఉన్నారు. సురక్షితంగా వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ సర్వీసులను వినియోగించుకోవాలి.
– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్, ఆర్టీసీ

అరుణాచలం..

కార్తీకపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలంలో గిరిప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం ఈనెల 13న రాత్రి ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నాయి. ఈ ప్యాకేజీలో కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ పుణ్య క్షేత్రాల సందర్శన కూడా ఉంటుంది. తిరిగి 16న ఉదయం వరకు డిపోలకు బస్సులు చేరుకుంటాయి. ఈ బస్సుల్లో టికెట్ల బుకింగ్ కోసం డిపోల్లో లేదా ww.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో కానీ సందర్శించవచ్చు.

అయ్యప్ప మాలధారుల కోసం..

ఉమ్మడి జిల్లాలో పలువురు భక్తులు అయ్యప్ప మాల ధరిస్తున్నారు. వీరు శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి అద్దె ప్రాతిపదికన సూపర్ లగ్జరీ బస్సులు నడపనుంది. బస్సు బుక్ చేసుకుంటే ఇద్దరు స్వాములు(గురుస్వామి-మణికంఠస్వామి), ఇద్దరు వంట మనుషులకే కాక సామగ్రి సర్దే ఒకరికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. వివరాల కోసం డిపో మేనేజర్‌ను సంప్రదించాలి.

పరమ పవిత్రం.. కార్తీకం

- పరమశివుడికి ప్రీతిపాత్రమైన మాసం
- అనేక పండుగలు ఈనెలలోనే..
- శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

ఖమ్మంగాంధీచౌక్/సత్తుపల్లి టౌన్/కొణిజర్ల: కార్తీక మాసం పవిత్రమైనది. పరమ శివుడికి ఈ నెల ఎంతో ప్రీతి పాత్రమైనది. ఈ మాసంలో చేసే ఆరాధన పాపం నుంచి విముక్తులను చేయడంతో పాటు భక్తి మార్గంలో నడిపిస్తుందని భక్తుల నమ్మకం. శనివారం నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాస మహోత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ఈనెల 2 నుంచి డిసెంబర్ 2 వరకు కార్తీక మాసంలో భాగంగా ఆలయాలను రంగులతో ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీక మాసానికి సమానమైన మాసమేదీ లేదని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో ఆలయాలు, తులసి కోటల దీపాలు వెలిగించడం ఆనవాయితీ. స్వయంగా దీపదానాలు చేయలేని వారు ఆరిన దీపాలను వెలిగిస్తే దీపదాన ఫలితాన్ని పొందవచ్చని నమ్మిక. కాగా, ఈనెలలోనే పలువురు అయ్యప్ప దీక్ష స్వీకరిస్తారు.

ప్రత్యేక పూజలు..

ఆధ్యాత్మికంగానే కాదు కార్తీకమాసాన్ని ఆరోగ్యప్రదమైన మాసంగా చెబుతారు. ఈ మాసంలో పలువురు ప్రతీ సోమవారం ఉపవాసదీక్ష చేస్తారు. తద్వారా అష్టైశ్వర్యాలు లభిస్తామని విశ్వాసం. ఈ హరిహరదాసులకు ప్రీతిపాత్రమైన ఈ నెలలో భక్తులు కఠిన నిష్ఠతో చేపట్టే నోములకు ప్రాధాన్యత ఉంది. ఉపవాసం, స్నానం, దానం వంటి ఫలితాలను ఇస్తాయని పండితులు చెబుతున్నారు. కాగా, జిల్లాలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఏర్పాట్లు చేయగా, ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం ఆకాశ దీపం వెలిగించనున్నారు.

అన్నీ విశేషాలే..

కార్తీకమాసంలో ఒక్కోరోజుకు ఒక విశేషం ఉంది. ఈ నెల మొత్తం పర్వదినాలే. చాలామంది భక్తులు ప్రతి రోజు ఉపవాసం ఉంటూ సాయంత్రం నక్షత్ర దర్శనం అయ్యాక విరమిస్తారు. ఇక కార్తీక పౌర్ణమి రోజున ఉపవాసం ఉంటే నెలంతా ఉన్న ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈనెల 5వ తేదీన నాగుల చవితి, 7, 21వ తేదీల్లో షష్టి, 15వ తేదీన కార్తీకపౌర్ణమి, 19న సంక హర చతుర్ది, 12, 26వ తేదీల్లో ఏకాదశి, 29వ తేదీన మాసశివరాత్రి వస్తాయి.

కుటుంబసభ్యుల చెంతకు బిహార్ వాసి


బిహార్ వాసిని కుటుంబీకులకు అప్పగిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌లో ఆశ్రయం కల్పించి వైద్యం చేయించగా కోలుకున్నాక బిహార్‌కు చెందిన ఆయనను కుటుంబీకులకు శుక్రవారం అప్పగించినట్లు ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. కొన్నాళ్లుగా ఆయనకు చికిత్స చేయిస్తుండగా ఇటీవలే కోలుకుని తన పేరు మొహమ్మద్ సగీర్ అని, బిహార్ రాష్ట్రంలోని కజియాహి లవ్డోలియా గ్రామమని చెప్పడంతో అక్కడ పోలీసులు, సర్పంచ్‌కు తెలియచేసి వివరాలు ఆరా తీశామని వెల్లడించారు. ఆయన సోదరులు సగీర్ ఫొటో చూసి గుర్తు పట్టి ఇక్కడకు రావడంతో కేఎంసీ మేనేజర్ విజయానంద్, ఆర్ఓ ఆర్.శ్రీనివాసరావు, మెప్మా ఉద్యోగి సుజాత సమక్షాన అప్పగించామని తెలిపారు.

వదిన చేతిలో మరిది హతం

తన చెల్లెలితో గొడవ ఎందుకని అడగడంతో ఘటన


కొర్ని ప్రదీప్ (ఫైల్)

ఖమ్మంరూరల్: పండుగ సందర్భంగా ఇల్లు శుభ్రం చేయలేదని వదినను ఆడపడుచు ప్రశ్నించగా గొడవ జరిగింది. దీంతో ఆడపడుచు పక్కింటికి వెళ్లిపోగా తన చెల్లెలితో ఎందుకు గొడవ పడ్డావని అడిగిన మరిదిని వదిన హత్య చేసిన ఘటన ఇది. ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో దీపావళి పండుగ రోజైన గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు... గ్రామానికి చెందిన కొర్ని రామయ్యకు కుమారులు ప్రశాంత్, ప్రదీప్, కూతురు ప్రవళిక ఉన్నారు. ఇందులో ప్రదీప్ మినహా మిగతా వారికి వివాహాలు అయ్యాయి. దీపావళి సందర్భంగా ప్రవళిక పుట్టింటికి రాగా, ఇంటిని ఎందుకు శుభ్రం చేయలేదని వదిన ఇందును ప్రశ్నించింది. దీంతో వదిన – మరదలు గొడవ పడడంతో ప్రవళిక పక్కింటికి వెళ్లిపోయింది. కాసేపయ్యాక వచ్చిన ప్రదీప్ తన చెల్లెలితో ఎందుకు గొడవపడ్డావని వదిన ఇందిరను ప్రశ్నించాడు. ఈమేరకు ఆగ్రహించిన ఆమె ప్రదీప్ ఛాతిలో కత్తితో పొడవడంతో కుప్పకూలాడు. కుటుంబీకులు ఆయనను ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై మృతుడి తండ్రి రామయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. కాగా, ఇందు తన పెద్దమ్మ రెంటాల మణి, అమ్మమ్మ భాగమ్మ, తల్లి దాసరి బాయమ్మ ప్రోద్బలంతోనే ఈ ఘటనకు పాల్పడినట్లు చెబుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


తెల్లపుట్ల గోపి(ఫైల్)

వైరారూరల్: దీపావళి పండుగ వేళ ఓ యువకుడు మృతి చెందగా, ఘటనపై అనుమానాలు ఉన్నాయని ఆయన కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని గరికపాడులో జరిగిన ఈ ఘటన వివరాలు... గ్రామానికి చెందిన తెల్లపుట్ల గోపి(24) గురువారం తన స్నేహితులతో వాలీబాల్ ఆడాక గరికపాడు ఏటిలో చెక్‌డ్యాం వద్ద ఈత కొట్టేందుకు వెళ్లాడు. గోపి ఈత కొడుతున్న సమయాన అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆయన స్నేహితులు గరికపాడులోని ఆర్ఎంపీ వద్దకు, అక్కడి నుంచి వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆయన మృతదేహాన్ని గరికపాడు తీసుకెళ్లారు. అయితే, గోపి బంధువులు శుక్రవారం డయల్ 100కు ఫోన్ చేసి మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో ఎస్సై ఏ.వంశీకృష్ణ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి తండ్రి దేవదాసు ఫిర్యాదుతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...


ఉపేందర్ (ఫైల్)

నేలకొండపల్లి: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఆరెగూడెంకు చెందిన కొలిపాక ఉపేందర్(44) గత సోమవారం చెట్టు ఎక్కి కొమ్మలు కొడుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కైకొండాయిగూడెం స్టేజీ సమీపాన గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని గురువారం గుర్తించగా, ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు. సదరు వ్యక్తి బచ్చలపండు రంగు టీ షర్ట్, లైట్ గ్రీన్ రంగు ప్యాంట్ ధరించగా, కుడి పాదం మడమ వద్ద గాయముందని వెల్లడించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బోనకల్: ఆటో – బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు... మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి వెంకటరామారావు తన మనవడు, మనవరాలితో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై రావినూతల వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో బోనకల్ నుండి వైరా వైపు వెళ్తున్న ఆటో వీరి బైక్‌ను ఫ్లైఓవర్‌పై ఢీకొట్టగా వెంకట్రావుకు తలకు గాయాలయ్యాయి. అలాగే ఆయన పూజిత కాలు విరగగా, మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ తగాదాలతో వివాహిత ఆత్మహత్య

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో నివాసముంటున్న వివాహిత కుటుంబ తగాదాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన రమ(32) పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబీకులు ఆమెను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కాగా, ఆమె ఆత్మహత్యకు భర్తే కారణమంటూ రమ బంధువులు ఆందోళన నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు.

అప్పు తీర్చలేక డ్వాక్రా లీడర్...

ఖమ్మంక్రైం: ఓ మహిళ అప్పులు తీర్చలేక మనోవ్యధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఖమ్మం వన్‌టౌన్ సీఐ ఉదయ్ కుమార్ తెలిపిన వివరాలు... కోదాడకు చెందిన అజీరత్ పాషా తన భార్య సాదిక్యా(32)తో కలిసి ఖమ్మం షాదీఖానా సమీపంలో కొన్నాళ్లుగా నివసిస్తున్నారు. అజీరత్ పాషా ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, ,సాదిక్యా చిరు వ్యాపారాలు చేస్తోంది. కాగా, కోదాడలో ఆమె డ్వాక్రా లీడర్‌గా పనిచేసి అక్కడి బ్యాంకులో రూ.4లక్షల రుణం తీసుకుంది. వాయిదాలు చెల్లించకపోవడంతో అటు బ్యాంకు నుంచి, ఇటు సహచర సభ్యుల నుంచి ఒత్తిడి పెరగడంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక గతనెల 30వ తేదీన ఉరి వేసుకుంది. ఈమేరకు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

క్షణికావేశంలో యువకుడు...

ఖమ్మంక్రైం: పండుగ సందర్భంగా అప్పటివరకు కుటుంబంతో సరదాగా గడిపిన యువకుడు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మం త్రీటౌన్ ఎస్సై కోట నాగేందర్ తెలిపిన వివరాలు... కొణిజర్ల మండలం తనికెళ్ల బీసీ కాలనీకి చెందిన చల్లా నాగేశ్వరరావుకు కుమారుడు వెంకట చాణక్య(20)తో పాటు కుమార్తె ఉన్నారు. దీపావళి సందర్భంగా నాగేశ్వరరావు తన కుమార్తె, మనవడిని ఇంటికి తీసుకొచ్చాడు. ఈక్రమంలో గురువారం మేనల్లుడితో ఆడుకుంటూ వెంకటచాణక్య గొడవపడ్డాడు. దీంతో తండ్రి మందలించగా మనస్తాపానికి గురైన చాణక్య ఖమ్మం కాల్వొడ్డులోని లారీల అడ్డా వద్దకు వచ్చి పురుగుల మందు తాగి లారీలో పడుకున్నాడు. రాత్రి పొద్దుపోయాక గుర్తించిన సెక్యూరిటీగార్డు ఆయన వద్ద ఉన్న ఫోన్ నుంచి కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఇక మెరుగైన మెనూ..!

- విద్యార్థుల డైట్ చార్జీలు 40 పెంపు
- కొత్త మెనూ రూపకల్పనలో నిమగ్నమైన అధికారులు
- జిల్లాలో 45 వేల మందికి పైగా విద్యార్థులకు లబ్ధి


పెనుబల్లి : మెస్ చార్జీల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్న కుంచపర్తిలోని మహాత్మాజ్యోతి బాపూలే పాఠశాల విద్యార్థులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల కోసం ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను ఏర్పాటు చేసింది. నాణ్యమైన విద్య, వసతి, భోజనం అందించేలా నిధులను కేటాయిస్తుండగా, ధరలకు అనుగుణంగా రెండు, మూడేళ్లకోసారి మెస్ చార్జీలను సవరిస్తుంది. అయితే, 2016–17 విద్యా సంవత్సరం తర్వాత ధరలు సవరించకపోవడంతో వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు. ఈమేరకు విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల నుండి పెరుగుతున్న డిమాండ్‌తో ప్రభుత్వం మెస్ చార్జీలే కాక కాస్మోటిక్ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెంచిన చార్జీలు శుక్రవారం నుంచే అమల్లోకి రాగా ఏడేళ్ల తర్వాత మెస్ చార్జీలు పెరగడంతో విద్యార్థులకు కొంతమేర నాణ్యమైన భోజనం అందతుందని ఆశిస్తున్నారు. కాగా, 2017 ధరల ప్రకారం నాడు నిర్ణయించిన డైట్ చార్జీలను ప్రస్తుతం 40 శాతం మేర పెంచడం విశేషం.

మెనూపై కసరత్తు..

వసతిగృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచడంతో మెనూ రూపకల్పనపై అధికారులు దృష్టి సారించారు. రోజూ ఉదయం రాగి జావ, పాలు, తర్వాత అల్పాహారం (ఇడ్లీ, గోధుమరవ్వ ఉప్మా, కిచిడీ వంటివి, సాయంత్రం కూరగాయలు, సాంబారు, పప్పు, రసంతో భోజనం పెట్టేలా మెనూ సిద్ధం చేస్తున్నారు. ఆదివారం చికెన్‌తో పాటు రోజు విడిచి రోజు అరటి పండు, ప్రతిరోజు కోడిగుడ్డు, సాయంత్రం వేళ స్నాక్స్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే మెనూ అమలుకు ఉన్నతాధికారుల నుంచి సూచనలు రావడంతో అధికారులు కూడా సిద్ధమవుతున్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో పెనుబల్లి మండలం కుంచపర్తిలోని మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటుమంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలపగా.. ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ వార్డెన్ కె.శిరీష, ఉద్యోగులు జ్యోతి, ఎస్.కే.అజీమ్ జానీ, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీలు (ఒక్కో విద్యార్థికి నెలకు రూ.ల్లో)

3నుంచి 7వ తరగతి వరకు బాలికలకు	55	175
8 నుండి 10వ తరగతి వరకు బాలికలకు	75	275
3నుంచి 7వ తరగతి వరకు బాలురకు	62	150
8నుంచి 10వ తరగతి వరకు బాలురకు	62	200

డైట్ చార్జీలు ఇలా..(ఒక్కో విద్యార్థికి నెలకు రూ.ల్లో)

విద్యార్థులు	పాత చార్జీ	కొత్త చార్జీ
3నుంచి 7వ తరగతి వరకు	950	1,330
8నుంచి 10వ తరగతి వరకు	1100	1540
ఇంటర్ మొదలు పీజీ వరకు	1500	2100

కేఎంసీ ప్రక్షాళనకు అడుగులు?

- ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై అధికారుల నిఘా
- డీజిల్ కూపన్ జారీ బాధ్యతల నుండి ఇద్దరి తొలగింపు



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ విభాగంలో ఔట్ సోర్సింగ్ విధానంలో విధుల్లో చేరిన పలువురు రాజకీయ, అధికారుల అండతో ఆతర్వాత కార్యాలయంలో తిష్ట వేశారు. క్షేత్ర స్థాయిలో పని చేయకుండా రకరకాల కారణాలు, డిగ్రీలు చూపిస్తూ కంప్యూటర్ ఆపరేటర్లు, బుక్ కీపర్లుగానే కాక అధికారుల వద్ద సబార్డినేటర్లుగా పదుల సంఖ్యలో చేరిపోయారు. మరికొందరు కంప్యూటర్ ఆపరేటర్లుగా చేరి కార్యాలయంలో ఖాళీగా ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యాన అధికారులు వీరిపై నిఘా వేసినట్లు తెలుస్తుండగా.. పని చేయని వారిని కార్యాలయం నుండి బయటకు పంపించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

డీజిల్ కూపన్ల పరిశీలన..

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా ఇటీవల విధుల్లో చేరిన అహ్మద్ షఫీఉల్లా సిబ్బంది పనితీరుపై నిఘా పెట్టినట్లు తెలిసింది. పారిశుద్ధ్య విభాగంలో వాహనాలకు డీజిల్ కూపన్ల జారీ, బిల్లుల చెల్లింపుల రికార్డులను పరిశీలించగా పలు అవకతవకలను బయటపడినట్లు సమాచారం. పని చేయకుండా షెడ్‌కు పరిమితమైన వాహనాలకు కూడా కూపన్లు జారీ చేసినట్లు గుర్తించారని తెలిసింది. దీంతో డీజిల్ కూపన్ల జారీ విభాగంలో ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శుక్రవారం పక్కన పెట్టినట్లు సమాచారం. అంతేకాక రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక కార్యాలయంలో పని చేయకుండా ఖాళీగా ఉంటున్న పలువురు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్షేత్ర స్థాయికి పంపించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలువురు సిబ్బందికి సూచనలు చేయగా, పారిశుద్ధ పనులకు వెళ్లకపోతే పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

ఊట్కూరు మేజర్ కాల్వకు గండి

కల్లూరురూరల్: మండలంలోని ఊట్కూరు వద్ద నాగార్జునసాగర్ మేజర్ కాల్వకు గురువారం అర్ధరాత్రి గండిపడింది. దీంతో నీరు పంట పొలాల్లోకి ప్రవహించగా పంట నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, గండి పడిన విషయం తెలియగానే ఆయకట్టు రైతులు ఎస్.కే.ఖాదర్, ఉన్నం రాజు, మందడపు మురళి, రాజకోటకొండ తదితరులు చేరుకుని నీరు వృథా కాకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. అధికారులు స్పందించి గండిని మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు.


కాల్వకు గండిపడడంతో వృథాగా పోతున్న నీరు

విదేశీ మద్యం ఎలాతెచ్చారు?

- పార్టీకి మద్యం ఎవరు సరఫరా చేశారు..?
- చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డిల విచారణ


విచారణకు వచ్చిన రాజ్ పాకాల

చేవెళ్ల: రాయల్టీ చెల్లించకుండా విదేశీ మద్యం ఎలా తీసుకొచ్చారు..స్టాంప్ డ్యూటీ చెల్లించారా ? పార్టీకి మద్యం సరఫరా ఎవరు చేశారు.. ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? పార్టీలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? పార్టీలో మద్యం పంపిణీ చేసినా పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు అంటూ పలు అంశాలపై కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను ప్రశ్నించినట్టు తెలిసింది. అనుమతి లేకుండా పార్టీ నిర్వహించాడనే కేసులో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల శుక్రవారం విచారణ నిమిత్తం చేవెళ్లలోని ఎక్సైజ్ కార్యాలయానికి హాజరయ్యారు. జన్వాడలోని ఆయన ఇంటి పక్కనే ఉండే నాగేశ్వర్‌రెడ్డి విల్లాలోనూ విదేశీ మద్యం దొరకడంతో ఆయనకూ నోటీసులు అందజేయగా, ఆయన కూడా చేవెళ్లకు వచ్చారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్‌కుమార్, చేవెళ్ల సీఐ శ్రీలత తదితరులు రాజ్‌పాకాల, నాగేశ్వర్‌రెడ్డిలను విచారించారు. అడ్వకేట్ల ఎదుట నిర్వహించిన విచారణకు సంబంధించిన వీడియోలు తీసుకున్నట్టు సమాచారం. మధ్యాహ్నం 1:40 నుంచి రాత్రి 8:10 వరకు విచారణ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు రాజ్‌పాకాలను, ఆ తర్వాత నాగేశ్వర్‌రెడ్డిని విచారించారు. అనంతరం రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి ఒకేసారి న్యాయవాదులతో కలిసి బయటకు వచ్చారు. అయితే ఇంట్లో నిర్వహించే చిన్నపాటి దావత్ అయినందున.. తమ మేనేజర్ ఈ విషయాలు చూసుకున్నారని రాజ్ పాకాల చెప్పినట్టు సమాచారం. విచారణ జరిగినంత సేపు మీడియాతోపాటు ఇతరులెవరినీ లోనికి అనుమతించలేదు. బయటకు వచ్చిన అనంతరం రాజ్ పాకాల మాట్లాడుతూ.. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాం. ఇంట్లో నిర్వహించిన చిన్నపాటి దావత్‌ను మా మేనేజర్ చూసుకున్నారు. పార్టీలో లోకల్ మద్యం సర్వ్ చేశామన్నారు.

కేసు ఇన్వెస్టిగేషన్‌లో ఉంది

ఈ కేసు ప్రస్తుతం ఇన్వెస్టిగేషన్‌లో ఉంది. రాజ్ పాకాల, నాగేశ్వర్‌రెడ్డి విచారణకు సహకరించారు. కేసు కంటిన్యూ అవుతోంది. కోర్టు పరిధిలో ఉన్నందున ఇంతకు మించి వివరాలేవీ చెప్పలేం. –దశరథ్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్


సిరిసిల్ల జిల్లా రంగంపేటలో గ్రామంలో తడిసిన వరి ధాన్యం


మంచిర్యాల జిల్లా మామిడిపల్లి శివారులో నేలవాలిన వరిపైరు


దుబ్బాక మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం

నోటికందే కూడు నీటిపాలు!

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలతో నేలవాలిన వరి

- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం.. ఇరవై రోజులుగా కొనుగోళ్లు లేక ఎక్కడికక్కడ ధాన్యం కుప్పలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- పిడుగుపాటుతో ఇద్దరు మృతి

మెదక్/ సిరిసిల్ల/ వీర్నపల్లి/ రుద్రంగి/ నిర్మల్/ వాజేడు: ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం నీటి పాలవగా.. కొన్నిచోట్ల కోతకు వచ్చిన వరిపంట పొలాల్లోనే నేలకొరిగింది. దీనితో అన్నదాతలు ఆందోళనలో పడిపోయారు. ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి ఇన్నిరోజులైనా ఇంకా కొనుగోళ్లు ఊపందుకోలేదని.. వర్షాలతో తమ ధాన్యం తడిసి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆరిపోయి తేమశాతం తగ్గిన వడ్లు కూడా వర్షానికి తడిశాయని, మళ్లీ ఆరబెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రతీ గింజ కొంటామని ప్రభుత్వం ప్రకటించిందని.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని మండిపడుతున్నారు.

తడిసిపోయిన ధాన్యం..: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 156 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోళ్లు మాత్రం మొదలుకాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా కురిసిన వర్షంతో రైతులు ఆగమాగమయ్యారు. వీర్నపల్లి, రుద్రంగి మండల కేంద్రాల్లో టార్పాలిన్లు లేకపోవడంతో వడ్లు తడిసిపోయాయి. రుద్రంగి మండలం పరిధిలో రైస్‌మిల్లర్లు ధాన్యం దింపుకోబోమని చెప్తున్నారని రైతులు వాపోతున్నారు.

- మరోవైపు ఉమ్మడి మెదక్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. దుబ్బాక, మెదక్, నర్సాపూర్, కొల్చారం, చిన్నశంకరంపేట, కొడిపల్లి, చిలప్‌చెడ్, నిజాంపేట, హత్నూర మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం నీటిపాలైంది. వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.
- నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో శుక్రవారం గంటకు పైగా వాన కురిసింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి వరద చేరింది. కుంటాల మండలంలో కోతకు వచ్చిన వరి నేలవాలింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి, జైపూర్ మండలాల్లో సుమారు 4,000 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. భీమిని, కన్నెపల్లి మండలాల్లో వందల ఎకరాల్లో పత్తి తడిసిపోయింది.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి

రాష్ట్రంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం దమ్మన్నపేటలో పత్తి ఏరుతుండగా పిడుగుపడి గడ్డం నాగమ్మ (26) అనే మహిళ మృతి చెందింది. ఇక ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురంలో వ్యవసాయ భూమిలో ఎడ్లను మేపుతుండగా పిడుగుపాటుకు గురై సొనప నవీన్ (24) మృతి చెందాడు.

సెటిల్‌మెంట్ అని పిలిపించి..
కారుతో తొక్కించి

మాజీ కానిస్టేబుల్ ఈశ్వర్‌పై హత్యాయత్నం

ఏళ్లుగా జేబుదొంగల గ్యాంగ్‌లు నిర్వహిస్తున్న ఈశ్వర్.. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలు

ఈ వ్యవస్థీకృత దందాలో ఇతడిదే పూర్తి ఆధిపత్యం.. దీంతో ముఠా నాయకుల మధ్య తలెత్తిన విభేదాలు

'దొంగలతో దోస్తీ' ఆరోపణలపై పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోల్పోయిన మేకల ఈశ్వర్‌పై గురువారం రాత్రి హత్యాయత్నం జరిగింది. వ్యవస్థీకృతంగా జేబు దొంగల ముఠాలు నడిపే ఈశ్వర్‌కు, ఆ ముఠాలకు చెందిన మరికొందరు నాయకుల మధ్య ఆధిపత్య పోరే దీనికి కారణమని తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కొన్నాళ్లుగా తమిళనాడులో ఉంటూ తెలంగాణ వ్యాప్తంగా సెల్‌ఫోన్ జేబు దొంగల ముఠాలు నిర్వహిస్తున్న ఇతడిని సెటిల్‌మెంట్ కోసమని పిలిచిన నలుగురు కీలక నిందితులు కారుతో ఢీ కొట్టారు. అతడి పైనుంచి రెండుసార్లు వాహనాన్ని నడపటంతో ఈశ్వర్ తీవ్రంగా గాయపడ్డాడు. మీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని మందమల్లమ్మ చౌరస్తా వద్ద ఈ ఘటన జరగ్గా.. ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు తెలిసింది. – సాక్షి, హైదరాబాద్

కక్ష కట్టి, సెటిల్‌మెంట్ అంటూ పిలిచి..

ఇలాంటి కొన్ని ముఠాలపై ఈశ్వర్ గుత్తాధిపత్యం సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నగరంలో మరే ఇతర ముఠాకు 'పనివారు' దొరకుండా చేస్తున్నాడని తెలిసింది. ఈ నేపథ్యంలో ఆధిపత్య పోరు పెరిగిపోగా ఎవరైనా అతికష్టమ్మీద వేరే ప్రాంతం నుంచి దొంగల్ని పట్టుకుని వస్తే, ఈశ్వర్ తనకున్న పాత పరిచయాల ద్వారా పోలీసులకు సమాచారం చేరవేస్తూ వాళ్లు అరెస్టు అయ్యేలా చేస్తున్నాడు. దీంతో కక్షకట్టిన నాలుగు ముఠాలకు చెందిన నాయకులు అతనిపై హత్యాయత్నం చేసినట్లు తెలుస్తోంది. గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని ఓ బార్‌కు అతన్ని పిలిచిన నలుగురు నిందితులు.. కొద్దిసేపు వాగ్వాదం తర్వాత తమ ప్రతిపాదనల్ని తిరస్కరించి, బెదిరించి వెళ్లిపోతున్న ఈశ్వర్‌పై కారుతో ఢీ కొట్టి హత్యాయత్నం చేసినట్లు తెలిసింది. అయితే కొందరు వ్యక్తులు చిట్టీల వ్యాపారంలో విభేదాల వల్లే ఈశ్వర్‌పై హత్యాయత్నం చేశామంటూ మీర్‌పేట పోలీసుల ఎదుట లొంగిపోయారని తెలుస్తోంది. దీంతో రాచకొండ పోలీసులు ఈ కేసును వివిధ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ వర్క్ చేస్తూ క్రిమినల్స్‌తో నెట్‌వర్క్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మేకల ఈశ్వర్ 2010లో కానిస్టేబుల్‌గా పోలీసు విభాగంలో అడుగుపెట్టాడు. ఎస్సార్‌నగర్, చిక్కడపల్లి, బేగంపేట పోలీసుస్టేషన్లతో పాటు టాస్క్‌ఫోర్స్‌లోనూ పని చేశాడు. మొదట్నుంచీ నేరాలకు సంబంధించిన విధులే నిర్వర్తించిన ఇతను.. అప్పట్లో చోరీ చేసిన ఫోన్లు ఖరీదు చేసే వాళ్లను బెదిరిస్తూ దందా మొదలెట్టాడు. తనకున్న పరిచయాలను వినియోగించుకుని చోరీకి గురైన ఫోన్ల ఐఎంఈఐ నంబర్లు సేకరించేవాడు. వాటి ఆధారంగా అవి ప్రస్తుతం ఎవరు వాడుతున్నారో గుర్తించేవాడు. విషయం తెలియక సెకండ్ హ్యాండ్ మార్కెట్లలో చోరీ ఫోన్లు కొనుగోలు చేసి వాడుతున్న వారిని పిలిచి బెదిరించేవాడు. ఫోన్ తీసుకోవడంతో పాటు కేసు పేరుతో భయపెట్టి కనీసం రూ.25 వేలు వసూలు చేసేవాడు. రికవరీ చేసిన ఫోన్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకునే వాడు. ఇలా మొదలైన ఈశ్వర్ దందా పెద్ద నెట్‌వర్క్‌గా మారింది.


ఈశ్వర్

వసతులు, 'జీతాలు' ఇచ్చి నేరాలు

చోరీ ఫోన్ల మార్కెట్‌పై పట్టు లభించడంతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకల్లో ఉన్న స్నాచర్లు, దొంగలతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఓ ప్రాంతానికి చెందిన వారిని మరోచోటుకు పంపేవాడు. అక్కడ వారికి అద్దె ఇంటిలో వసతి కల్పించేవాడు. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం నాలుగు ఫోన్లు కొట్టేయాలనే టార్గెట్ పెట్టేవాడు. వీటిలో ఒక ఫోన్‌ను విలువను లెక్కించి ఆ మొత్తాన్ని జీతం కింద వారికి ఇచ్చేవాడు. ఇక ఈ ఫోన్లను విక్రయించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో ఉన్న సెకండ్ హ్యాండ్ మార్కెట్లలోని వ్యాపారులతో సంబంధాలు పెట్టుకున్నాడు. వీరినుంచి ప్రతినెలా మామూళ్లు కూడా వసూలు చేసేవాడని తెలిసింది. మరోవైపు సెల్‌ఫోన్లతో పాటు బంగారు నగలనూ స్నాచింగ్ చేయించేవాడు. 2022లో నల్లగొండ పోలీసులు ఈ తరహా ఓ కేసులో ఈశ్వర్‌ను అరెస్టు చేయడంతో హైదరాబాద్ పోలీసులు అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు.

తల్లిదండ్రులకు అప్పులిచ్చి పిల్లలతో దందా

హైదరాబాద్‌లో ఫోన్ల దొంగతనం, విక్రయం దందా చేసే ముఠాలు ఎన్నో ఉన్నాయి. కొన్నాళ్లుగా వీళ్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లో ప్రత్యేకంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. తల్లిదండ్రులకు భారీ మొత్తం అప్పు ఇవ్వడం ద్వారా వారి పిల్లలతో హైదరాబాద్ సహా దక్షిణాదిలోని ఇతర ప్రధాన నగరాల్లో దందా చేయిస్తున్నారు. వీరికి వసతి కల్పించడంతో పాటు ఆహారం, మద్యం సరఫరా చేయడమే కాకుండా ప్రతిరోజూ రూ.300 ఖర్చుల కోసం ఇస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, బస్సులు, సభలు, సమావేశాల్లో సెల్‌ఫోన్ల చోరీ వీరి పని. ఈ ముఠాల్లో అప్పులు తీసుకున్న మహిళలు కూడా ఉన్నారు. వీరు తమ చిన్నారులతో కలిసి బంగారం, ఇతర దుకాణాలకు వెళ్లి, యజమానులు వర్కర్ల దృష్టి మళ్లించి చోరీలు చేస్తుంటారు. వీరు ప్రతిరోజూ నిర్దిష్ట సంఖ్యలో చోరీలు చేయాలనే షరతు ఉంది. కాగా చోరీ చేసిన సొత్తులో కొంత మొత్తం వారి అప్పులో అసలు, వడ్డీ జమ చేసుకుంటారు. ఇలా అప్పు తీరే వరకు వీరంతా ముఠా నాయకుల కోసం పని చేయాల్సి ఉంటుంది. ఇలాంటివి నగరంలో పలు ముఠాలు ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన


సీసీ రోడ్డును తనిఖీ చేసిన అధికారులు

కారేపల్లి: ఖమ్మం జిల్లా సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్ల నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. కారేపల్లిలోని క్యాబిన్ బజార్, బీసీ కాలనీ, భారత్ నగర్, ఎన్‌టీఆర్ నగర్‌లో వేసిన సీసీ రోడ్లకు పగుళ్లు వచ్చాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో క్వాలిటీ కంట్రోల్ బృందం నాణ్యతను తనిఖీ చేసింది.

5 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 327 పోస్టుల నియామకానికి నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ పరీక్ష ఆగస్టు 6, 7వ తేదీల్లో నిర్వహించగా 327 మందితో మెరిట్ జాబితాను గత నెల 29న యాజమాన్యం విడుదల చేసిన విషయం విదితమే. ఈ మేరకు అభ్యర్థుల సర్టిఫికెట్లను కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో పరిశీలించనుండగా, ఆతర్వాత మెడికల్ బోర్డుకు పంపిస్తారు.

వంతెనను పరిశీలించిన ఐటీడీఏ పీఓ


వంతెనను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

అశ్వాపురం: మండలంలోని రామచంద్రాపురం–ఒడ్డుగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన వంతెనను ఐటీడీఏ పీఓ రాహుల్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ధర.. ఎక్కువ నాణ్యత!



సైట్‌లో పొందుపరిచిన ఉపకరణాల చిత్రాలు

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే సరి..

విద్యుత్ ఉపకరణాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని నేరుగా ఇంటి వద్ద డెలివరీ పొందే అవకాశాన్ని ఈఈఎస్‌ఎల్ కల్పించింది. వినియోగదారులు www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ హోమ్ పేజీలోకి వెళ్లి అందుబాటులో ఉన్న, అవసరమైన విద్యుత్ ఉపకరణాలను ఆర్డర్ చేసి కొనుగోలు చేయవచ్చు. ప్రధాన పట్టణాలు, నగరాల్లోనైతే ఆర్డర్ చేసిన 6–7 రోజుల్లో, ఇతర ప్రాంతాల్లో 10–12 రోజుల్లో ఉపకరణాలు ఇంటికి చేరతాయని చెబుతున్నారు.

ఎన్పీడీసీఎల్ సైట్‌లో విద్యుత్ ఉపకరణాల కొనుగోలుకు అవకాశం

- ఈఈఎస్‌ఎల్ ద్వారా బుకింగ్, ఇంటి వద్దే డెలివరీ
- కేంద్ర, రాష్ట్ర సంస్థల భాగస్వామ్యంతో విక్రయాలు
- అందుబాటులో బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు, స్టౌలు, ఏసీలు

ఖమ్మంవ్యవసాయం: నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను సరసమైన ధరలకు వినియోగదారులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొచ్చాయి. మార్కెట్‌లో రకరకాల కంపెనీల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నా నాణ్యత, తక్కువ విద్యుత్ వినియోగించుకునే వాటిపై అవగాహన లేక వినియోగదారులు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. దీంతో అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన పరికరాలను అందించే లక్ష్యంతో ప్రభుత్వ సంస్థలు ముందుకొచ్చాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధంగా నిర్వహిస్తున్న ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్‌ఎల్) సంస్థ పలు రకాల విద్యుత్ ఉపకరణాలను విక్రయిస్తుండగా ఇవి నాణ్యమైనవే కాక విద్యుత్ బిల్లుల్లో ఆదా అవుతుందని సంస్థలు స్పష్టం చేస్తున్నాయి.

ఎన్పీడీసీఎల్ భాగస్వామ్యంతో..

ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ అందుబాటులోకి తీసుకొచ్చిన విద్యుత్ ఉపకరణాల నాణ్యత, ధరలనే కాక వినియోదారులకు బిల్లుల్లో ఆదా అవుతుండడాన్ని ఎన్పీడీసీఎల్(నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్పీడీసీఎల్) గుర్తించింది. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఈ ఉపకరణాలు మేలు చేసేవిగా ఉండడంతో ప్రోత్సహించడం కేంద్ర విద్యుత్ శాఖ అనుబంధ సంస్థ అయిన ఈఈఎస్‌ఎల్‌తో ఎన్పీడీసీఎల్ భాగస్వామ్యమైంది. రెండు సంస్థల ఆధ్వర్యాన విద్యుత్ ఉపకరణాలను విక్రయించేందుకు నిర్ణయించి ఒప్పందం కుదుర్చుకున్నాయి.

విద్యుత్ ఉపకరణాల ధరలు (రూ.ల్లో)

ఉపకరణం	ఎంఆర్‌పీ	ప్రభుత్వ ధర
ఎల్ఈడీ బల్బ్ 9 వాట్స్ (3 స్టార్)	150	75
ఎల్ఈడీ బల్బ్ 6 వాట్స్ (5 స్టార్)	149	85
ఎమర్జెన్సీ ఎల్ఈడీ 10 వాట్స్	649	459
ట్యూబ్‌లైట్ 20 వాట్స్	349	199
సీలింగ్ ఫ్యాన్ (5 స్టార్)	4,100	2,699
ఎలక్ట్రికల్ స్టౌ 12 వాట్స్	2,999	1,900
ఏసీ 1 టన్ (5 స్టార్)	55,000	36,500
ఏసీ 1.5 టన్ (5 స్టార్)	71,000	48,150

ఖమ్మం – ఇల్లెందు రోడ్డుకు మహర్దశ

- రూ.38 కోట్లతో నాలుగు లేన్లుగా విస్తరణ
- మిగతా పనులకు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు
- రెండు జిల్లాల నడుమ లింక్ రోడ్డు అభివృద్ధి


రహదారి విస్తరణకు చదును చేయిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారికి మహర్దశ పడుతోంది. రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు నాలుగు లేన్లుగా విస్తరణ, డివైడర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.38 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ పనులకు కొన్నాళ్ల క్రితం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయగా.. ఇటీవలే రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఖమ్మం నుంచి రోడ్డును విస్తరిస్తూ మూడు విడతల్లో రఘునాథపాలెం వరకు పూర్తిచేశారు. తాజాగా రఘునాథపాలెం నుంచి మరో 6.5 కి.మీ. మేర రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు బూడిదంపాడు సమీపం వరకే సరిపోతుండగా, ఖమ్మం నియోజకవర్గం పరిధిలోనే మరో 2 కి.మీ. మేర నిర్మాణానికి నిధులు కేటాయించాల్సి ఉంది.

మిగతా పనులకు కూడా..

ఖమ్మం నియోజకవర్గంలో మిగిలిన 2 కి.మీ.తో పాటు ఇల్లెందు నియోజకవర్గ పరిధి లింగాల క్రాస్ వరకు మిగిలిన రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించేందుకు సుమారు రూ.40 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఈ నిధులు కూడా మంజూరైతే ఇల్లెందు – ఖమ్మం మధ్య ట్రాఫిక్ ఇక్కట్లు తీరనున్నాయి.

నానాటికీ పెరుగుతున్న రద్దీ

ఈ రహదారిలో నిత్యం వందలాదిగా బస్సులు, లారీలు, ఆటోలు, కార్లు, ట్రాక్టర్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటికి తోడు ఇల్లెందులో ఉత్పత్తి అయ్యే బొగ్గును లారీల ద్వారా తరలించేది ఈ రహదారి మీదుగానే కావడంతో రద్దీగా ఉంటోంది. అంతేకాక ప్రతీ బుధవారం కామేపల్లి మండలం పండితాపురం వద్ద జరిగే సంతకు వేలాదిగా జనం హాజరవుతుండడంతో తరచుగా ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మరోపక్క రఘునాథపాలెంలో విత్తన గిడ్డంగి, గోదాంలు ఉండటం, త్వరలోనే సమీకృత గురుకుల పాఠశాల, స్వామినారాయణ్ పాఠశాలల నిర్మించనున్నారు. ఫలితంగా రద్దీ మరింత పెరుగుతోంది. అయితే, నాలుగు లేన్లుగా ఉన్నంత వరకు ప్రయాణం సాఫీగా సాగుతున్నా డబుల్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం రహదారిని విస్తరిస్తుండడం, మిగిలిన ప్రాంతంలోనూ విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించడంతో సమస్యలు తగ్గి రెండు జిల్లాల నడుమ లింక్ రోడ్డు అభివృద్ధి చెందనుంది.

కులమతాలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

నేలకొండపల్లి: అధికారం కోసం బీజేపీ కులాలు, మతాలను అడ్డు పెట్టుకుని పబ్బం గడుపుకుంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. నేలకొండపల్లి మండలం బైరవునిపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిస్వార్థంగా పోరాడుతూ, జైలు జీవితాలను గడిపింది కమ్యూనిస్టులు మాత్రమేనని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ నాయకులకు జైలుకు వెళ్లిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. కమ్యూనిస్టు పార్టీలను అంతం చేస్తామన్న టీడీపీ తెలంగాణలో లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కాగా, బీజేపీ నేతలకు రాముడిపై భక్తి లేకపోగా, ఓట్ల కోసమే రామజపం చేస్తున్నారని విమర్శించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మరికంటి ఉమారాణి, రమేష్, గండు సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు కూనంనేనిని సన్మానించారు. ఈ సమావేశంలో సీపీ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, కర్నాటి భానుప్రసాద్, పొట్లీయ శ్రీనివాసరావు, కనకబండి సీతారాములు, పెద్దపాక గురవమ్మ, మేకల పుల్లయ్య, మల్లెబోయిన ఉపేందర్, పోలంపల్లి నారాయణ, కుంచం బిక్షం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాలల మహాపాదయాత్ర


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరగనున్నందున నిలిపివేయాలనే డిమాండ్‌తో భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు మాల మహానాడు ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర చేపట్టిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌కు యూనిటీ ఆఫ్ మాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం సుధాకర్, నాయకులు కమటం లక్ష్మణ్, కొప్పుల అశోక్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, తమ పాదయాత్ర 16 జిల్లాల్లో వెయ్యి కి.మీ. మేర సాగుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పప్పుల ప్రసాద్, ధరమల్ల ఉపేందర్, సందు రాజు, ఉండేటి ప్రకాశం, గుంతేటి వెంకటేశ్వర్లు, నూకతొట్టి సాల్మన్‌రాజ్, ఉండేటి ధర్మరాజు, ఉబ్బని కార్తీక్, కిరణ్, తూమాటి హజరయ్య తదితరులు పాల్గొన్నారు.